ప్రజాశక్తి
సోమవారం 2 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మంత్రి అంటే మర్యాద లేదా.?

- ఆయన సొంతూరుకు వచ్చి రేషన్‌దుకాణం వద్దనే ఉన్న జేసీ..
- ఇంటికి వచ్చి టిఫిన్ చేయండని మంత్రి ఆహ్వానించినా స్పందించని వైనం

తూర్పునాయుడుపాలెంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందజేస్తున్న మంత్రి స్వామి, జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కొందరు ఉన్నతాధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. సమాజానికి అతీతులమనే భావన కూడా వారిలో కనిపిస్తోంది. ఆదివారం నాడు జేసీ గోపాలకృష్ణ, ఇతర ఉన్నతాధికారులు మంత్రి డోలావీరాంజనేయస్వామి పట్ల వ్యవహరించిన తీరు చర్చకు తావిచ్చింది. మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సొంతూరు తూర్పు నాయుడుపాలెం. ఆయన అక్కడే తన ఇంటినే క్యాంపు కార్యాలయంగా మార్చి అక్కడ నుంచే పాలన సాగిస్తున్నారు. ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా ఉన్న ఇంటినే కొద్దిపాటి మార్పులు చేసి వచ్చిన జనానికి ఇబ్బంది లేకుండా చేశారు. ఇంటి బయటే కూర్చుని ప్రజాదర్బార్ నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఆదివారంనాడు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకుల పంపిణీని ఓ ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టింది. మంత్రి స్వామి తన సొంతూరు లోనే రేషన్‌దుకాణంలో సరుకుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి జేసీ గోపాల కృష్ణ, ఇతర అధికారులు హాజరయ్యారు. అయితే ఇక్కడే ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరు చర్చగా మారింది. ఎంతటి అధికారైనా మర్యాదగా మంత్రి క్యాంపు కార్యాలయానికి రావడం, ఆయన్ను కలవడం మర్యాద. పైగా మంత్రి సొంతూరు ఇది. ఇక్కడకు వచ్చిన అధికారులు మర్యాదగా ఆయన ఇంటికి వెళ్లి కనిపించడం కూడా సహజంగా జరుగుతుంది. రేషన్ సరుకుల పంపిణీకి మంత్రితో పాటు ప్రోటోకాల్‌లో భాగంగా వచ్చిన జేసీ గోపాలకృష్ణ వ్యవహరించిన తీరు చర్చగా మారింది. మంత్రి ఊరికి వచ్చిన ఆయన కనీసం ఆయన ఇంటికి ▶ 2లో

నెరవేరని వ్యవసాయ మంత్రి హామీ

- అరకొరగా కొంటున్న కంపెనీలు..
- రంగప్రవేశం చేసిన దళారులు..
- సరాసరి రూ.6 వేల ధర పలుకుతున్న నల్లబర్లీ పొగాకు
- అమలు కాని రెండు గ్రేడ్ల విధానం
- నాణ్యమైన నల్లబర్లీ మాత్రమే కొంటున్న కంపెనీలు
- జిల్లాలో రైతుల వద్ద 5.80 లక్షల క్వింటాళ్ల నల్లబర్లీ పొగాకు నిల్వలు

బర్లీ పొగాకు నిల్వలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'పొగాకు రైతులెవరూ అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది. చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంటా' మని నల్లబర్లీ పొగాకు రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీ నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. గత నెల 24న నల్లబర్లీ పొగాకు రైతులు, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధులతో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖాముఖి కార్యక్రమం మార్టూరులోని పర్చూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఆ రోజు సుదీర్ఘ చర్చల అనంతరం నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై కార్యాచరణ ప్రణాళికను మంత్రి ప్రకటించారు. నల్లబర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కొనుగోలు చేస్తామని కామన్ వెరైటీ క్వింటా ధర రూ.12 వేలకు, లోగ్రేడ్ రకాన్ని రూ.6 వేలతో కొనుగోలు చేయాలంటూ ధరలను నిర్ణయించారు. నల్లబర్లీ పొగాకును మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతాంగానికి అండగా నిలవాల్సిన బాధ్యత కంపెనీలదేనన్నారు. కంపెనీలు తమ పద్ధతి మార్చుకోవాల్సిందేనని, పంట కొనుగోలు చేయకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పొగాకు కొనుగోలుపై వ్యాపారస్తులు సీరియస్‌గా దష్టి పెట్టి తక్షణమే కొనుగోళ్లు మొదలుపెట్టాలని, లేదంటే సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందని అదే జరిగితే చాలా సీరియస్‌గా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు ఆనాడు కంపెనీల వారిని హెచ్చరించారు. కానీ మంత్రి హెచ్చరికను కంపెనీల వారు ఏ మాత్రం ఖాతరు చేసిన పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

జిల్లాలో పర్చూరు, అద్దంకి, చీరాల నియోజకవర్గాల పరిధిలో నల్లబర్లీ పొగాకును 56 వేల ఎకరాల్లో సాగు చేశారు. నల్లబర్లీ పొగాకు నిల్వలు రైతుల వద్ద 5.80 లక్షల క్వింటాళ్ల వరకు ఉన్నాయి. మంత్రులు మద్దతు ధర నిర్ణయించి వారం రోజుల్లో రెండు వేల క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. సమావేశాల్లో ఎవరు ఏమి చెప్పినా కంపెనీల వారు మాత్రం పాత పద్ధతిలోనే తక్కువ ధర మీదే కొంటున్నారు. రోజుకు 200 చెక్కుల వరకు నాణ్యమైన పొగాకు మాత్రమే ▶ 2లో

మాట్లాడుతున్న మాజీ శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు

భారత సమైక్యతను కాపాడుకోవాలి..

- ఉగ్రవాద ఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలి
- అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలి
- మాజీ శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

భారతదేశ సమైక్యతను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని శాసన మండలి మాజీ సభ్యులు కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన సమైక్యతా సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ఏప్రిల్ 22న పెహల్గాం ఉగ్రవాద కాల్పులకు 26 మంది పర్యాటకులు మరణించిన ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయని, దేశ ప్రజలందరూ సమైక్యంగా ఖండించినట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఘటనను వాట్సాప్ యూనివర్సిటీ, బిజెపి, కార్పొరేట్ మీడియా వక్రీకరించి ట్రోల్ చేసిన అంశం దేశ సమైక్యతకు భంగం కలిగిస్తుందన్నారు. ముస్లిములు హిందువులను చంపారని వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా చేసిన ప్రచారాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ కారణంగా ముస్లిములు హిందువులు చంపారు అన్న అపవాదుతో బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లిములపై 184 చోట్ల దాడులు జరిగాయన్నారు. ఉగ్రవాదానికి కులం లేదని, మతం లేదని అన్నారు. దానికి ప్రాంతంతో కూడా పనిలేదన్నారు. హింసను ప్రేరేపించటమే ఉగ్రవాదం లక్షణమని పేర్కొన్నారు. ఈ ఉగ్రవాదానికి అగ్రవాదమే కారణమని విమర్శించారు. ఉగ్రవాదం ఏ దేశానికీ పరిమితం కాదని, ఇరాక్, పాకిస్తాన్, సిరియా, పాలస్తీనా, బ్రిటన్, స్పెయిన్ ఇండోనేషియా, అమెరికా వంటి దేశాలు కూడా ఉగ్రవాద చర్యలకు గురైన దేశాలుగా ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉగ్రవాదానికి అమెరికాయే కారణమని ఆయన దుయ్యబట్టారు. ప్రపంచంలో ఆధిపత్యం సాగించేందుకు అమెరికా చేస్తున్న కుట్రగా ఆయన విమర్శించారు. మొన్నటి వరకు అరబ్ దేశాలపై కన్నేసిన అమెరికా, నేడు పెట్రోలియం నిక్షేపాల కోసం ఆఫ్ఘనిస్తాన్ పైనున్న ఐదు మధ్య ఆసియా దేశాలను తన గుప్పెట్లో ఉంచుకొనేందుకు ఆయా దేశాలపై పట్టు సాధించేందుకు అమెరికా కుట్ర పన్నుతుందని ఆరోపించారు. పాకిస్తాన్ ఎలాగూ ▶ 2లో

రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్ వద్ద ఘటన 3లో ▶

తూర్పునాయుడుపాలెం ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి స్వామి

పారదర్శకంగా రేషన్ పంపిణీ

మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

రేషన్ పంపిణీలో పేదలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారదర్శకంగా, ఎలాంటి విమర్శలకు తావు లేకుండా రేషన్ అందించడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం, టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్నతో కలిసి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని పున: ప్రారంభించి, రేషన్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎండియు వ్యవస్థను తీసుకువచ్చి యండియు వాహనాలు ఇంటికి పోకుండా వీధిలో ఒక చోట ఉంచి రేషన్ ఇవ్వడం ▶ 2లో

మాట్లాడుతున్న మంత్రి స్వామి

పారదర్శకంగా రేషన్ పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

జరిగేదని, వాహ నం ఎప్పుడొస్తుందో తెలియక కార్డుదారులు ఇబ్బంది పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ షాపులను పున: ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందు బాటులో ఉంటాయన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, ఒంగోలు ఆర్‌డిఓ లక్ష్మీప్రసన్న, జిల్లా పౌరసరఫరాల అధికారి పద్మశ్రీ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తల్లపనేని రవికుమార్, టంగుటూరు తహశీల్దార్ జి.ఆంజనేయులు, పలువురు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం తూర్పునాయుడు పాలెం, ఎస్సీ కాలనీలో సిమెంట్లు, సైడ్ కాల్వలకు మంత్రి స్వామి భూమి పూజ చేశారు.

రేషన్‌లో అక్రమాలను నిరోధించాలన్నదే లక్ష్యం

కొండపి: ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్ కార్డుదారులు ఇబ్బందులు పడరాదనే ఉద్దేశ్యంతో రేషన్ పంపిణీలో అక్రమాలను నిరోధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీని చేపట్టాలని నిర్ణయించిందని మంత్రి స్వామి పేర్కొన్నారు. ఆదివారం కొండపి మండలం, కె ఉప్పలపాడు గ్రామంలో రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని పున:ప్రారంభించి రేషన్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గుండపనేని అచ్యుత్‌కుమార్, డిఎస్ఓ పద్మశ్రీ, తహశీల్దార్ మురళి, ఎంపిడిఒ శ్రీ రామాంజనేయులు, మాజీ ఏయంసి చైర్మన్ జి.రామయ్యచౌదరి పాల్గొన్నారు.

మంత్రి అంటే మర్యాద లేదా.?

(మొదటిపేజీ తరువాయి)

రావాలి. అయితే ఆయన వెళ్లలేదు. ఉన్నతాధికారిగా మంత్రి ఇంటికి వెళ్లి అక్కడ నుంచి సరుకుల పంపిణీకి ఆహ్వానించడమో లేక ఇద్దరూ కలిసి వెళ్లడమే జరగాలి. అలా జరగలేదు. అయితే మంత్రి డోలా జేసీ గోపాలకృష్ణ తన ఊరికి వస్తున్నారని తెలిసి ఫోన్ కూడా చేసి టిఫిన్‌కు ఆహ్వానించారు. ఆయన తాను ఇంటి వద్దే చేశానని సాదాసీదాగా చెప్పి రాలేదు. పైగా ఊరిలో రేషన్ దుకాణం వద్దనే జేసీ, డిఎస్ఒ, ఆర్డీఓ, ఇతర అధికారులు వేచి ఉన్నారు. జేసీతో పాటు అధికారులు అందరూ వచ్చారని సమాచారం తెలుసుకున్న మంత్రి డోలా వెంటనే అక్కడకు చేరుకొని సరుకులు పంపిణీ చేశారు. ఏదేమైనా జేసీ గోపాలకృష్ణ, ఇతర ఉన్నతాధికారులకు మంత్రి అంటే మర్యాద కూడా లేకుండా పోయిందనే విమర్శలు అక్కడ వినిపించాయి.

మలేరియా నివారణ ర్యాలీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, మలేరియా వ్యాధిని నియంత్రించేందుకు చేపట్టిన మలేరియా మాసోత్సవంలో భాగంగా ఆదివారం యర్రగొండపాలెంలోని ఏరియా వైద్యశాల ఆవరణలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జె విజయభాస్కర్ మాట్లాడుతూ ముఖ్యంగా వర్షాకాలంలో వేగంగా వ్యాప్తిచెందే మలేరియాను నివారించేందుకు ప్రతి ఒక్కరూ మేల్కొని ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మురికి నీటి గుంటలు లేకుండా తక్షణమే పూడ్చివేయాలన్నారు. చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని వివరించారు. వైద్య శాఖ అందిస్తున్న మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ పిసిహెచ్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకులు పి ఆవులయ్య, ఎం రవిబాబుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతంలో ఉద్యోగుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-మార్కాపురం

వెంకట కృష్ణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే 'కందుల'

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. అందులో యేర్వ వెంకట కృష్ణారెడ్డి అరుదైన వ్యక్తి అని కొనియాడారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన రికార్డు అసిస్టెంట్ యేర్వ వెంకట కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. పాఠశాల నిర్వహణలో బోధనేతర సిబ్బంది పాత్ర కీలకమైందన్నారు. యేర్వ వెంకట కృష్ణారెడ్డి సున్నితమైన మనస్తత్వం కలిగిన వ్యక్తి అన్నారు. నిజాయితీ, నిబద్ధతతో ఉద్యోగ జీవితాన్ని గడిపారన్నారు. పారిశ్రామికవేత్త యేర్వ భూపాల్‌రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు యేర్వ వెంకట రామిరెడ్డి, వై సత్యనారాయణరెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం యేర్వ కృష్ణారెడ్డి, ఆయన సతీమణి కృష్ణవేణిలను సత్కరించారు.

రేషన్ పంపిణీ చేస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

సరుకులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దారవీడు

రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం పేదలకు అందించే నిత్యావసర వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. మండలంలోని దేవరాజుగట్టు 19వ నెంబర్ రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబుకు టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి, దేవరాజుగట్టు సర్పంచి మెట్టు లక్ష్మీదేవి, ఎంపిటిసి దండా వెంకట రమణమ్మ, టిడిపి నాయకులు దండా వెంకటేశ్వరరెడ్డి, గుమ్మా గంగరాజు, తిరుమలరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో టిడిపి అభివృద్ధికి విశేషంగా కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు అన్నారు. నూతనంగా టిడిపి పట్టణ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన పెరుమాళ్ల మల్లికార్జునను ఆదివారం యర్రగొండపాలెం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టిడిపికి యువరక్తం ఎంతో అవసరం అన్నారు. యువకులంతా పని చేసి రానున్న ప్రతి ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ల మల్లికార్జున, కార్యదర్శి పూలసుబ్బయ్య, వెంకటాద్రిపాలెం సర్పంచ్ బోడా శ్రీశైలపతి నాయుడు, నాయకులు చేకూరి సుబ్బారావు, చీదెళ్ల నాగేశ్వరరావు, నిమ్మల ఈదన్న, మల్లికార్జున, గోళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

నెరవేరని వ్యవసాయ మంత్రి హామీ

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు చేస్తున్నారు. రైతులు పొగాకును గ్రేడింగ్ చేసి తీసుకెళితే అన్ని కంపెనీలు వేసే రేట్లు అన్ని కలిపితే సరాసరి క్వింటాకి రూ.6 వేలు ధర పడుతుందని రైతులు చెబుతున్నారు. పొగాకు రైతుల కోసం పర్చూరు కేంద్రంగా టోల్ ఫ్రీ నెంబరు 8331057095 కూడా ఇచ్చారు. ఇప్పటివరకు ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కు 100 వరకు ఫిర్యాదులు వచ్చాయి. అన్ని ఫిర్యాదులు కూడా వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించిన ధర అమలులో లేదనే ఉంటున్నాయి. ఆనాటి సమావేశంలో పాల్గొన్న ఐటీసీ, జీపిఐ, ఇండియన్ టొబాకో అసోసియేషన్ తదితర కంపెనీల ప్రతినిధులు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పొగాకు కొనుగోలు చేస్తామని సమావేశంలో చెప్పడం జరిగింది. కానీ అరకొరగా కొంటున్న కంపెనీల వాళ్ళ విధానం మాత్రం మారలేదు. గ్రేడింగ్ చేసి పాత విధానం ప్రకారమే కొనుగోలు చేస్తున్నారు. పొగాకు ధర కూడా వారికి నచ్చిన ధరనే వేసి పంపుతున్నారు. గత్యంతరం లేక రైతులు పొగాకును అప్పజెప్పి వచ్చేస్తున్నారు. చిన్న కంపెనీల వారు, మధ్య దళారులు కొన్ని గ్రామాల్లోకొచ్చి కొద్దికొద్దిగా నాణ్యమైన పొగాకు మాత్రమే తక్కువ ధర ఇచ్చి కొంటున్నారు. మంచి నాణ్యమైన పొగాకు అయితే రూ.9 వేల నుంచి రూ.11 వేలకు కొంటామంటున్నారు. నల్లబర్లీ ఎకరాలకు సరాసరిన 11 క్వింటాళ్ల పొగాకు దిగుబడి వస్తే అందులో నాణ్యమైన ఐదు క్వింటాళ్లు పోతే మిగిలిన ఆరు క్వింటాళ్ళు పొగాకు రైతుల వద్దనే ఉండిపోతుంది. పంట సాగు కోసం అప్పులు తెచ్చిన రైతులు కూలి డబ్బులు కూడా ఇవ్వని పరిస్థితి ఉంది. అప్పుల ఒత్తిడి తట్టుకోలేక రైతులు పొగాకును తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి స్థానికంగా ఉంది.

ప్రధానంగా అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలోని గ్రామాల రైతులు అత్యధికంగా వేసిన నల్లబర్లీ పొగాకు పంట అమ్ముడుపోక ఇళ్ల వద్దనే మండేలలో నిల్వలు ఉన్న నేపథ్యంలో వర్షాలు పడుతున్న కారణంగా ఇంకా నష్టపోతామన్న భయంతో ఉన్నారు. మంత్రుల సమావేశం అనంతరం జిల్లాలో ఇప్పటివరకు 2 వేల క్వింటాళ్ల వరకు కొనుగోళు జరిగినట్లు తెలుస్తోంది. కంపెనీల వారు అంగీకరించిన మేరకు అన్నా నల్లబర్లీ కొంటే మిగతాది ప్రభుత్వం అయినా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంది. గతంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసిన అన్ని కంపెనీల వారు కూడా ఇప్పుడు రైతుల నుంచి కొనేలా ఒత్తిడి తేవాల్సి ఉంది. ఈ ఏడాది దిగుబడి కూడా తగ్గిన నేపథ్యంలో క్వింటా రూ.12 వేలకు కొన్నా రైతులకు నష్టమే. కానీ ఈ ధరకు కూడా కంపెనీల వారు కొనడం లేదు. మంత్రులు ఎంత గట్టిగా చెప్పినా నాణ్యమైన నల్లబర్లీ మాత్రమే అది కూడా తక్కువ ధర పైనే వారు కొంటున్నారు. నల్లబర్లీ కొనుగోళ్లలో ఎలాంటి మార్పు లేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఆత్మస్థైర్యం కోల్పోయి పొగాకు రైతులు ఆత్మహత్యాయత్నం ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఈ సమస్యకు ప్రభుత్వం సత్వర పరిష్కారాన్ని చూపాల్సి ఉంది.

భారత సమైక్యతను కాపాడుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

తన చెప్పుచేతల్లో ఉందని, భారతదేశం తనకు మిత్రత్వ దేశమని, ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు మిగిలిన ఐదు దేశాల తన గుప్పెట్లో పెట్టుకుం టే సంపద తన సొంతం చేసుకోవచ్చనే వ్యూహంతో అమెరికా కుట్ర పన్నుతోందన్నారు. ఉగ్రవాదం ఈ రోజు పుట్టుకురాలేదన్నారు. స్వాతంత్ర్యం పూర్వం నుంచి ఉగ్రవాదం చర్యల ను విశ్వవ్యాప్తంగా వేర్పాటువాదశక్తులు పెంచి పోషిస్తున్నాయన్నారు. కాగా చనిపోయిన వారిలో మహిళలు ఉన్నారని, పిల్లలు ఉన్నారని, జమ్మూకాశ్మీర్‌లో కూడా సమైక్యత వ్యక్తమయిం దని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముస్లిములే తన ప్రాణాలు కాపాడినట్లు బాధితులు పేర్కొన్న అంశాన్ని సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఘటనపై ప్రజలు పెద్దఎత్తున స్పందించార న్నారు. ఈ ఘటన అనంతర చోటుచేసుకున్న పరిణామాలు భారతదేశ సార్వభౌమాధికారానికి తలవంపులు తెచ్చేవిగా ఉన్నాయన్నారు. కల్నల్ సోఫియా ఖురేషిపై బిజెపి మంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయంపై సైనికులు మోదీ కాళ్లకు నమస్కరించాలని చేసిన వ్యాఖ్యలు అవమానక రమన్నారు. ఈ అంశం మతపరమైనదిగా సృష్టించి మతవిభజన గావిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఒకవైపు దేశవ్యాప్తంగా కార్మికులు జాతీయ సమ్మెకు పిలుపునిచ్చిన తరుణంలో మరోవైపు బీహార్ ఎన్నికల ప్రక్రియలో మే 8న యుద్ధం ప్రారంభించి.. మే 10న యుద్ధం విరమించడం వెనుక అమెరికా జోక్యం అత్యంత ఆక్షేపనీయ మన్నారు. ఆపరేషన్ సింధూర్ అంశాన్ని బీహార్ ఎన్నికల అస్త్రంగా ఉపయోగించుకోవటం అత్యంత విచారకరమన్నారు. అమెరికా ప్రపంచ రాజకీయాల్లో తీవ్రంగా జోక్యం చేసుకుంటుందని ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం ఒక దేశ సార్వభౌమధికారంలో మరో దేశం ఉండకూడదని అయినప్పటికీ.. భారత్-పాక్ విషయంలో భారతదేశ సార్వభౌమాధికారాన్ని ప్రధాని మోడీ అమెరికాకు తాకట్టు పెట్టినట్లు ఆయన ఆరోపించారు. అమెరికా విదేశాంగ మంత్రి కాల్పుల విరమణ ప్రకటించటం భారతదేశానికి భారత దేశ సార్వభౌమాధికారానికి తీవ్ర అవమానకరమన్నారు. దేశంలో రాజకీయ పార్టీలు, వామపక్షాలు వద్దని వారించినా.. చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించినప్పటికీ మోడీ లెక్క చేయలేదని విమర్శించారు.

వాస్తవంగా కాశ్మీర్ సమస్యను మోడీయే సృష్టించారని, 370 అధికరణ రద్దు చేయడం, కనీస రాష్ట్ర హోదా కూడా లేకుండా చేయటం వంటి పరిణామాలు కాశ్మీర్ ప్రజల మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నాయన్నారు. కాశ్మీర్ ఘటన వెనుకున్న కారణాలను అధ్యయనం చేయాలని, పాకిస్తాన్..భారతదేశం సరిహద్దు అంశంలో ఐక్యరాజ్య సమితిపై ఒత్తిడి తేవాలని, ఈ అంశంపై పార్లమెంట్లో చర్చించడం ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించడం, అఖిలపక్ష సమావేశాలు నిర్వహించటం ద్వారానూ భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా సమస్యను అధిగమించవచ్చన్నారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలు చేయటమే మోడీ ప్రభుత్వం వ్యూహమన్నారు. హిందూ రాజ్యస్థాపన ఎజండాగా 370 ఆర్టికల్ రద్దు, ఉమ్మడి పౌరసత్వం, వక్ఫ్ చట్టం అమలు తదితర చట్టాల ద్వారా సంస్కరణలు చేపట్టినట్లు ఆయన ఆరోపించారు. భారతదేశంలో ఉన్న భిన్నత్వాన్ని రక్షించుకునేందుకు ప్రజాతంత్ర వాదులు ముందుకు రావాలని సూచించారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ పెహల్గాం దాడుల వెనుక భద్రతా వైఫల్యం ఉందన్నారు. భారత సైన్యంలో సంస్కరణలు చేపట్టి కాశ్మీర్ ప్రాంతంలో ఉన్న సైన్యాన్ని ఆపరేషన్ కగారు పేరున నక్సలైట్ల ఏరివేతకు మిలటరీ బలగాలను ఏజెన్సీ ప్రాంతాలకు తరలించినట్లు ఆరోపించారు

సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ మైనార్టీలు, కమ్యూనిస్టులు, క్రిస్టియన్లు దేశానికి వ్యతిరేకులుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిత్రీకరిస్తోందని విమర్శించారు. సమావేశంలో సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసులు, కంకణాల ఆంజనేయులు తదితరులు మాట్లాడారు.

ప్రజాశక్తి
సోమవారం 2 జూన్ 2025

బొప్పాయి తోట ధ్వంసం

అర్ధరాత్రి చెట్లు నరికిన దుండగులు - సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం - పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని పెట్లూరు గ్రామానికి చెందిన కొల్లూరి చంద్రమౌళికి చెందిన బొప్పాయి చెట్లను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారని బాధితులు తెలిపారు. చంద్రమౌళి చెందిన సర్వేనెంబర్ 49-1బీలో 4.63 ఎకరాల పొలంలో బొప్పాయి చెట్లు సాగు చేయగా అందులో సుమారు మూడు ఎకరాలకు పైగా బొప్పాయి చెట్లను నరికి వేశారని బాదితుడు తెలిపారు. దీంతో సుమారుగా రూ.20లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. కొండపి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరు ధ్వంసం చేశారో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మండలంలోని పెట్లూరులో బొప్పాయి తోటను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు బచ్చల కోటేశ్వరరావు కోరారు. ఆదివారం సాయంత్రం పెట్లూరు గ్రామంలో దెబ్బతిన్న బొప్పాయి తోటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షపూర్వకంగా గ్రామంలోని గుర్తు తెలియని వ్యక్తులు బొప్పాయి తోటను ధ్వంసం చేశారన్నారు. ఈ ధ్వంసం వలన సుమారు 20 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి నష్టపోయిన రైతుకు నష్టపరిహారం అందించాలన్నారు. బొప్పాయి తోట ధ్వంసం చేసిన దుండగులను పట్టుకునే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. బాధిత రైతును పరామర్శించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని తరఫున అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు శ్రీనివాసరెడ్డి, కోయవారిపాలెం సుబ్బు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొప్పాయి చెట్లని నరికిన దృశ్యం

ధ్వంసమైన తోటను పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

ప్రజాశక్తి-దర్శి

వెన్నుపోటు అంటే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. ఆదివారం ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏడాది ప్రజా పాలన చూసి ఓర్వలేని జగన్మోహన్‌రెడ్డి వెన్నుపోటు అంటూ నిరసన కార్యక్రమం చేపట్టడం సిగ్గుచేటు అన్నారు. గత వైసీపీ చేసిన ద్రోహాలు ప్రజలు మర్చిపోలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి ప్రజా విశ్వాసాన్ని కోల్పోయి కేవలం 11 సీట్లకు పరిమితమైన జగన్‌రెడ్డి నేనున్నానంటూ మర్చిపోకుండా తమ పార్టీ ఉనికి కాపాడుకునేందుకు దిగజారుతున్న వైసీపీ నేతలను నిలబెట్టుకునేందుకు ప్రయత్నం ఈ నిరసన కార్యక్రమం అన్నారు. ఏడాదికి ఎన్డీఏ కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి ప్రజల్లో ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు.



పిచ్చయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయాలి

ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్యకు సన్మానం

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి ఆధ్వర్యంలో హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మొర్రి పిచ్చయ్యను ఘనంగా సన్మానించిన బ్రహ్మానందాచారి మాట్లాడుతూ సామాజిక సేవే భగవంతుని సేవన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ పిచ్చయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక సేవ చేయాలన్నారు. అనంతరం వేసవి శిక్షణ తరగతులల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి, రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకట రామిరెడ్డి, యువ ప్రగతి పథం అధ్యక్షుడు ఫరూక్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ కొలుపులు

ప్రజాశక్తి-తాళ్ళూరు

తాళ్లూరు మండలంలోని వెలుగువారిపాలెంలో ఘనంగా అంకాలమ్మ ఘనంగా నిర్వహించారు. కొలుపులు రెండు రోజులు ముందుగానే కార్యక్రమం ప్రారంభం కాగా బొల్లి ఆవుల ఊరేగింపు పూజలు నిర్వహించారు. ఆదివారం రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, టిడిపి నాయకులు కొండారెడ్డి, వీరనాగిరెడ్డి, సర్పంచి ముచ్చుమారి కోటేశ్వరమ్మ, బ్రహ్మారెడ్డి, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాజ్యాంగ పరిరక్షణ

పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల కేంద్రమైన తర్లుపాడులో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని విమర్శిస్తూ ప్రస్తుత భారత ప్రభుత్వం, బిజెపి మత విద్వేషాలను రేకెత్తిస్తుందన్నారు. దీని వలన భారత ప్రజల మధ్య ఐక్యత దెబ్బతీసే అవకాశం ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం స్థానంలో అనధికారికంగా మనస్మృతిని అమలు చేయడనికి పూనుకుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక తర్లుపాడు దివంగత నేత వైఎస్ఆర్ విగ్రహానికి సైదాతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాపు వెంకటకష్ణారెడ్డి, పాలపర్తి విజేష్ రాజ్, మన్నం ప్రసన్నరాజు, షేక్ రెహనాబాను, గోరంట్ల కోటేశ్వరరావు, పిల్లి వెంకటేశ్వర రెడ్డి, కాకర్లపూడి వేణు, ఇరిగినేని వెంకట నరసయ్య, ఈమని కోటేశ్వరరావు, కె.ఎస్ ప్రసాద్ రావు, దాసరి బాబురావు, షేక్ మహబూబ్ అలీ, షేక్ హుస్సేన్, సయ్యద్ ఇమ్రాన్, షేక్ సుభాని, షేక్ మహమ్మద్ ఇమ్రాన్, కొట్టు వరప్రసాద్ బాబు, ముల్లా జిలాని, షేక్ నాయబ్ రసూల్, వరప్రసాద్‌అబ్దుల్ రెహమాన్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొనగా షేక్ మహబూబ్ వలి మరియు షేక్ హుస్సేన్ లు కలిసి జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులందరినీ శాలువాలతో సన్మానించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్ సమీపంలో అద్దంకి-నార్కెట్ పల్లి రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అందిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి పెయింట్ డబ్బాలతో హైదరాబాదు వెలుతున్న బోలోరో వాహనం వేగంగా వెళ్తూ ఒక వాహనాన్ని ఢీకొంది. గమనించిన ఏల్చూరు గ్రామానికి చెందిన బత్తుల బసవయ్య, చల్లా శ్రీనివాసరావులు బోలోరో వాహనాన్ని ఆపేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో అడ్డరోడ్డు జంక్షన్ దాటిన తర్వాత బొలొరొ వాహనాన్ని క్రాస్ చేసే సందర్భంలో మోటార్ సైకిల్‌ను ఢీకొని రివైడర్‌పై తిరగబడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ఉన్న బత్తుల బసవయ్య (45), చల్లా శ్రీనివాసరావు (48) రోడ్డుపై పడ్డారు. దీంతో బసవయ్యకు తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరావుకు కాళ్లు చేతులు విరిగాయి. శ్రీనివాసరావును 108 అంబులెన్స్ ద్వారా నరసరావుపేట ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో ఏల్చూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని సీఐ వెంకటరావు, ఎస్ఐ పట్టాభిరామయ్య పరిశీలించారు. బోలొరొ వాహనానం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి-దొనకొండ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గృహోపకరణాలు, వస్తువులు దగ్ధమైన సంఘటన మండలంలోని కలివెలపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బత్తుల రామిరెడ్డి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో దూర ప్రాంతంలోని పొలం పనులకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ వలన మంటలు చెలరేగాయి. చుట్టు ప్రక్కల ఇళ్లకు చెందిన వారు మంటలు, పొగలు వస్తుండటం గుర్తించి హుటాహుటిన ఇంటి తాళాలు పగులకొట్టి మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రామిరెడ్డికి చెందిన గృహ వస్తువులైన ఫ్రిడ్జ్, టీవి, బీరువా, బట్టలు దాదాపు రూ.2లక్షల విలువ చేసే వస్తువులు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

4న 'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయాలి

మాజీమంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం రోజులైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంపై ఈనెల నాలుగో తేదీన కొండేపిలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైసిపి కార్యకర్తలు ప్రజలు విజయవంతం చేయాలని మాజీమంత్రి, కొండేపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కోరారు. ఆదివారం నాడు శింగరాయకొండలోని క్యాంపు కార్యాలయం వద్ద వాల్ పోస్టర్‌ని ఆవిష్కరించి అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు లేనిపోయిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంవత్సరం రోజులైనా కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సంవత్సరం రోజుల్లో అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. కొండేపి నియోజకవర్గ కేంద్రంగా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆరోజు ఎన్నికల సమయంలో చంద్రబాబు చెబుతున్న మాటలకు జగన్ ఎన్నిసార్లు సభలో వివరించిన ప్రజలు నమ్మలేదని ఈరోజు ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. రాష్ట్రంలో బియ్యం అమ్ముకోవడానికి వాహనాలు ఎత్తేసి ఇలా షాపులు తెరుస్తున్నారని అన్నారు. ఎన్నికల హామీలు తెలుగుదేశం పార్టీ అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ మహానాడు పులివెందులలో పెట్టాలని చూసి తర్వాత కడపలో పెట్టారని పులివెందులలో స్థలం దొరకనే కడపలో పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. తెనాలిలో అంతలోవు పెద్ద ఘటన జరిగితే ఎవరూ నోరు మెదపలేని పరిస్థితిలో కూటమి నాయకులు ఉన్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది కాబట్టే వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని కోరారు. కొండేపి ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ఈనెల నాలుగో తేదీన ర్యాలీ ఉంటుందని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, దాకా పిచ్చిరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కె.సుల్తాన్, పఠాన్ రియాజ్, యనమల మాధవి, చుక్కా కిరణ్‌కుమార్, పొన్నలూరు జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు మసనం వెంకట్రావు, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

'శ్రీరామ్' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ మీద శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో సుమారు 250 మందికి ఉచితంగా బిపి, షుగర్, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, పల్స్ ఆక్సీమీటర్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో న్యూరో సర్జన్ డాక్టర్ షేక్ వలీబాబు తమ వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కొప్పోలు సా మిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్ పాల్గొన్నారు.



స్వర్ణలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని స్వర్ణ గ్రామ ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో శ్రీ కేలం రామకోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. శిభిరంలో 100మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రామ్మోహనరావు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా తాము ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరాలతో పాటు మొక్కల పంపిణీ, హై స్కూల్ విద్యార్థులకు స్కాలర్షిప్ పంపిణీ, అనాధలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి తోడ్పడాలనే ఉద్దేశంతో తాము పని చేస్తున్నామని అన్నారు. ట్రస్టు సభ్యులుగా కెవిఎస్ ప్రసాద్, ఎం పద్మావతి, సిహెచ్ సుశీల, డిశివ పార్వతి, పి శిరీష, కె దీప్తి ఉన్నారు. వైద్య శిబిరంలో షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ పివి నాగరాజు, పిల్లలు, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ కె దీప్తి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత మందుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి మొలబంటి వసంతరావు, ఎం భూషయ్య, ఎం సాంబయ్య, టి జగన్మోహనరావు, టి మల్లికార్జున, కటికి వాసు, ఎం రమేషు, ఎం సాంబయ్య పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్ల కోసం బస్సులో వెళ్తున్న బాధితులు

రోటరీ ఆధ్వర్యంలో 76 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - పంగులూరు

కంటి శుక్లంల ఆపరేషన్ కోసం 76మందిని గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రికి తరలించినట్లు రోటరీ ఐ కేర్ రీజనల్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య ఆదివారం తెలిపారు. రోటరీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా పంగులూరులో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి హాజరైన 200మందిలో 140 మందికి శుక్లంల ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. వీరిలో ప్రస్తుతం 76 మందిని రెండు బస్సుల్లో శంకర్ కంటి ఆసుపత్రికి పంగులూరు నుండి తరలించినట్లు తెలిపారు. మిగతా వారిని రెండు రోజుల తర్వాత పంపిస్తామని చెప్పారు. ఇకనుండి ప్రతి నెల చివరి శనివారం రోటరీ ఆధ్వర్యంలో పంగులూరులో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని, వైద్యులు సూచించిన వారికి ఉచితంగా కళ్ళ జోళ్ళు అందజేస్తామని అన్నారు. గత నెలలో ఆపరేషన్ చేయించుకున్న వారికి ఈ నెలలో కళ్ళజోళ్ళు ఇస్తామని, ఈ నెలలో ఆపరేషన్ చేయించుకున్న వారికి వచ్చే నెలలో కళ్ళజోళ్ళు ఇస్తామని తెలిపారు.

నేడు యోగా శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కళ్యాణ మండపంలో సోమవారం 7గంటలకు మండల స్థాయి యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. యోగా శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకున్న సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. యోగా శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారని తెలిపారు. యోగ ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తునన్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీల వేతనాలు వెంటనే ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కొల్లూరు

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కిష్కిందపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి బి సుబ్బారావు వెళ్లి కార్మికుల సమస్యలు ఆదివారం అడిగి తెలుసుకున్నారు. గత ఆరు వారాల నుండి పనులు చేస్తున్నప్పటికీ వేతనాలు రావడం లేదని కూలీలు తెలిపారు. ప్రస్తుత సంవత్సరం పనులు అయిపోతున్నాయని, ఆదనంగా పనులు చూపించాలని కూలీలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం పనులైన చూపించాలని, లేకుంటే తిండైనా పెట్టాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు చేసి జాతీయ గ్రామీణ ఉపాధి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టి కృష్ణమోహన్

హామీ పథకం చట్టం తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించడం వలన సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వేసవిలో మజ్జిగ, మంచినీళ్లు, పలుగు, పార అలవెన్సులు లేకుండా పోయాయని అన్నారు. పెరిగిన కుటుంబ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు వారం చెల్లింపులు చేయాల్సి ఉండగా ఆరు వారాల నుండి వేతనాలు అందకపోతే ఏ విధంగా కూలీల కుటుంబ అవసరాలు తీరతాయని అన్నారు. అందుకు ప్రభుత్వం మేట్ల వ్యవస్థ పునరుద్ధరిస్తూ ఇచ్చిన జీఒ అమలు చేయాలని కోరారు. మేట్లు వ్యవస్థ ఉపాధి హామీ కూలీలకు ప్రత్యేక అలవెన్స్ ఇచ్చి పని ఇవ్వడం, పని చేయించుకోవడం, కొలతలు వేయించడం వంటి పనులు పారదర్శకంగా జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇంకోరారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కారం చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలు అంతా కలిసి ఆందోళన చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ వేతనాలు రావడం కోసం కృషి చేయాలని కోరారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - ముండ్లమూరు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ సమావేశం వేంపాడులో షేక్ మీరావళి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అంట ఏడుకొండలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతేడాదితో పోల్చు కుంటే రైతులు పండించిన పంటలు సగం ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గతేడాది మిర్చి కింటాకి రూ.28వేలు ఉండగా ప్రస్తుతం రూ.10వేలు, ధాన్యం గతేడాది రూ.2200 అమ్మగా ప్రస్తుతం రూ.1400, కందులు, మినుములు గతేడాది రూ.10వేలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు నాయకులు

ఉండగా ప్రస్తుతం రూ.6వేలు, పొగాకు గతేడాది రూ.28వేలకు అమ్మగా ప్రస్తుతం రూ.20వేలు మాత్రమే ఉన్నాయని అన్నారు. వైట్ బర్లీ పొగాకు ఈ ఏడాది కంపెనీలు కొనక రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. గతేడాది కంటే వ్యవసాయానికి అయ్యే ఖర్చు పెరిగిందని, ఖర్చు పెరిగి రాబడి తగ్గి అప్పులై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఇవి ఆత్మహత్యలు కాదని, ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల జరుగుతున్న హత్యలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు మారాలంటే రైతులు ఐక్యమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని అన్నారు. దీనిలో భాగంగా జూన్ 22న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు హాజరు కావాలని కోరారు. అనంతరం సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు గంగినేని సత్యనారాయణ, గాలి వెంకటేశ్వర్లు, ఎస్కె మీరావాలి, అంజయ్య పాల్గొన్నారు.

రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ ప్రారంభం

చౌక డిపోలో బియ్యం పంపిణీ చేస్తున్న నరేంద్ర వర్మ

రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజాశక్తి - బాపట్ల

రేషన్ షాపుల ద్వారా బియ్యం సరుకులు పంపిణీని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదివారం పట్టణంలోని 1వ వార్డు బేతనీ కాలనీలో రేషన్ షాపులో సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ సలగల రాజశేఖర బాబు, తహశీల్దారు సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, సివిల్ సప్లై డిటి ఫణి కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, సోముల ప్రసాద్ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలో ఆదివారం ఉదయం డీలర్ షాపుల వద్ద రేషన్ కార్డు దారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహశీల్దారు రవి కుమార్ మాట్లాడుతూ వృద్దులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిటి విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కరరావు, టిడిపి నాయకులు ఎన్ రంగయ్య చౌదరి, నాగేశ్వరరావు, సీతయ్య, సుబ్బరామయ్య, పూనూరు మాజీ సర్పంచ్ బి సాంబయ్య, తారక రామారావు, కె వంశీ, అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.

అద్దంకి : రేషన్ కార్డు లబ్దిదారులకు రేషన్ డీలర్ల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దారు జి శ్రీ చరణ్ పేర్కొన్నారు. మండలంలోని చక్రాయపాలెం, బొమ్మనంపాడు గ్రామాల్లో రేషన్ సరుకుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బియ్యం, చక్కెర పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, సర్పంచులు, విఆర్ఒలు, ప్రజలు పాల్గొన్నారు.

కొల్లూరు : రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. చింతలంక మాజీ సర్పంచి కోగంటి శివ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంగులూరు : వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను ఆయా షాపు డీలర్లు అందజేస్తారని తహశీల్దారు పి సింగారావు అన్నారు. రేషన్ దుకాణాల వద్ద సరుకులు పంపిణీని ఆయన ఆదివారం ప్రారంభించారు. కల్లంవారిపాలెంలో వృద్ధ మహిళ ఎర్రం సుబ్బాయమ్మకు డీలర్ సుబ్బారెడ్డి చేత రేషన్ బియ్యాన్ని ఇప్పించారు. ప్రతి రేషన్ కార్డు దారుడుకి అరకిలో చక్కెర రూ.17లకు అందజేస్తారని తెలిపారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అవినీతి అక్రమాలకు తావు లేకుండా రేషన్ షాపులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల్లో తెలుగుదేశం నాయకులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

వేటపాలెం : ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా నడపాలని టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య అన్నారు. రేషన్ డీలర్ల ద్వారా సరుకుల పంపిణీని మండ లంలోని దేశాయిపేట 41వ షాపులో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యవస్థం చేశారని అన్నారు. ఎక్కువ మంది ప్రజలు సరుకులు తీసుకునేందుకు పనులు మానుకొని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. నెలలో 15 రోజులు రెండు పూటలా సరుకులు అందే విధంగా మార్పు చేసినట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇక్కట్లు లేకుండా ఇంటి వద్దనే సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ షాప్ డీలర్ రామిశెట్టి సుబ్బారావు, పింజల మల్లికార్జున, సత్రం బాబురావు, పిచ్చుక భార్గవ పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలో గ్రామాల్లో రేషన్ షాపును ప్రారంభించినట్లు తహశీల్దారు బ్రహ్మయ్య తెలిపారు. మండల కేంద్రమైన పర్చూరులో రేషన్ షాపులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు స్థానిక టిడిపి నాయకులు రేషన్ షాపుల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభించారు. షాపులకు వచ్చిన లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎ శ్రీనివాసరావు, ఎస్కె గౌస్‌బాషా, శ్రీరామ్ వెంకట సుబ్బారావు, విఆర్ఒ వై శ్రీనివాసరావు, రేషన్ డీలర్లు కె పవన్ కుమార్, పి రాఘవయ్య, టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంతమాగులూరు : రేషన్ సక్రమంగా పంపిణీ అయ్యేందుకు అందరూ సహకరించాలని ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్ కోరారు. మండలంలోని ఫత్తేపురంలో చౌక ధరల దుకాణం వద్ద రేషన్ పంపిణీని ఆయన ప్రారం భించారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

చెరుకుపల్లి : రేషన్ షాపులు వద్దనే రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సీనియర్ నాయకులు ఎంఆర్కె మూర్తి, దివి రాంబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బలుసులపాలెం సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి, కుంచాలవారిపాలెంలో డిటి ఓంకార్ ప్రారంభించారు.

వేమూరు : రేషన్ దుకాణాల ద్వారానే కార్డుదారులు సరుకులు పొందాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గుట్టిపాటి పూర్ణ కుమారి, నాయకులు విజయబాబు, తహశీల్దారు సుశీల పాల్గొన్నారు. భట్టిప్రోలులో టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబా, బట్టు మల్లికార్జునరావు, ఐలవరంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు దీపాల ప్రసాదరావు ప్రారంభించారు.

నేటి నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఇంటర్మీడియట్ విద్య మండలి అనుసంధానంలోని (బోర్డు ఆఫ్ ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్) అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు సోమవారం నుండి పున్నప్రారంభం అవుతాయని జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి కె ఆంజనేయులు, ఆర్ఐఒ ఎ సైమన్ విక్టర్ ఆదివారం నాడు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల లో చదువుతున్న విద్యార్థినివిద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కూడా అమలుకు ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులందరికి సర్వేపల్లి రాధాకష్ణ విద్యా మిత్ర పథకం క్రింద ఉచిత పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పాటికే టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరినట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు కళాశాలలో జాయిన్ అయిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కావున విద్యార్థులు అందరు ప్రభుత్వకళాశాలల విద్యా అవకాశాలను వినియోగించుకొని చదువులలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

వైభవంగా లతా హాస్పిటల్ ప్రారంభోత్సవం

- సేవాదృక్పథంతో వైద్య సేవలందిస్తా..
- హాస్పిటల్ ఎండీ రాజ్‌కుమార్

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ విజయలక్ష్మి

ప్రజాశక్తి-చీరాల

ప్రజలందరికీ అందుబాటులో అత్యధిక మెరుగైన వైద్య సేవలను సేవా దృక్పథంతో అందించడమే లతా హాస్పిటల్ లక్ష్యం అని హాస్పిటల్ ఎండి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గొలిమి రాజ్‌కుమార్ అన్నారు.ఆదివారం చీరాలలోని స్థానిక హైమా హాస్పటల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన లతా హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.లత హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ గుంటపల్లి సుబ్బారావు హాజరుకాగ ప్రత్యేక అతిథిగా డిఎం అండ్ హెచ్ ఓ ఎస్ విజయలక్ష్మి హాజరై ప్రారభించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి డాక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవలకు గుంటూరు విజయవాడ వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండా చీరాల పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను లతా హాస్పిటల్ లోనే అందిస్తూ చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అన్ని వైద్య సదుపాయాలను అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి లత హాస్పిటల్ తెచ్చిందన్నారు. కావున ప్రజలందరూ లతా హాస్పిటల్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెక్రటరీ పి శ్రీకాంత్,షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ కె శేఖర్ యాదవ్, డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ గోరంట్ల రాజేష్ డాక్టర్ కృష్ణ చైతన్య,డాక్టర్ మార్తాండం, డాక్టర్ బి రవితేజ, పరువురు ఐఎంఎ వైద్యులు హాజరయ్యారు.

కార్పొరేట్ల సంపదను పంపిణీ చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

స్వయం ప్రకటిత దేశ భక్తులుగా ఫోజులు కొడుతున్న బిజెపి, ఆర్‌యస్‌యస్ లాంటి మతోన్మాద రైటిస్టులు, అదాని, అంబానీ వంటి కార్పొరేట్ల కబంద హస్తాలలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు చిక్కి నలిగిపోతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. ఆదివారం ఒంగోలు లోని మల్లయ్యలింగంభవన్ లో సిపిఐ ఒంగోలు నగర 14వ మహాసభలు నిర్వహించారు. కె అంజయ్య, ఇస్తర్ల నరసింహారావు,సి హెచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షవర్గంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ మోడీ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ దేశాన్ని అప్పుల ఉబిలోకి నెట్టి వేస్తున్నారని అని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి యం.యల్.నారాయణ మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీలలో దర్శిలో జరుగుతున్న పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. రామకష్ణ, నగర సీనియర్ నాయకులు కారుమూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు. న్యాయవాది రాఘవరావు జెండా ఆవిష్కరించారు.

అదనపు పాయింట్లు పొందినవారు సరిచేయించుకోవాలి

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

జిల్లాలోని ఉపాధ్యాయులు 8 సంవత్సరాలు పైబడి సర్వీస్ చేసి, అదనపు పాయింట్లు పొందినవారు సంబంధిత అధికారులతో సరి చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషనలైజేషన్ పాయింట్లు తప్పు సమాచారముతో పొందినట్లు ఆరోపణలు వచ్చినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కృష్ణారావుకు సన్మానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సమాచార శాఖలో 30 సంవత్సరాలు సేవలందించిన ఏ.వి.సూపర్‌వైజర్ గడ్డం కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం స్థానిక జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జరిగింది. కృష్ణారావుతో పాటు ఆయన సతీమణిని అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు శాలువాలు కప్పి పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు టి.మోహన్‌రాజు, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్ కష్ణమోహన్, ఏపీఆర్ఓ ఐ.సురేష్, పి ఆర్ ఓ కె.కిరణ్ కుమార్, సీనియర్ సహాయకులు పద్మావతి పాల్గొన్నారు.

అక్రమాలు నిరోధించేందుకే

రేషన్‌షాపుల ద్వారా సరుకులు పంపిణీ

- రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మన్జీర్ జిలానీ
- ఒంగోలులో రేషన్ షాపులు పున:ప్రారంభం

రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిత్యావసర వస్తువుల పంపిణీలో అక్రమాలు నిరోధించేందుకు రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు.ఆదివారం ఒంగోలులోని సంతపేట, రామ్‌నగర్‌లలో ఉన్న రేషన్ దుకాణాలను మేయర్ గంగాడ సుజాత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమూన్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎం.డి.యు. వాహనాల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయడంతో వాహనదారులు ఎక్కడో ఒకచోట వాహనాన్ని నిలిపి సరుకులు ఇచ్చేసి వెళ్లిపోతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో రేషన్ షాపుల వ్యవస్థను పున:ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 65 ఏళ్లు పైబడిన కార్డుదారులు ఉంటే వారికి ఇంటి వద్దే రేషన్ సరుకులను అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. బియ్యం, చక్కెరతో పాటు వచ్చే నెల నుంచి రాగులు, జొన్నలను కూడా రేషన్ షాపుల ద్వారా ఇస్తామన్నారు. చౌకధరల దుకాణ వ్యవస్థను పున:ప్రారంభించడం వల్ల డీలర్లకు భృతి లభిస్తున్నదని, రాబోయే రోజుల్లో వీటిని మినీ మార్టులుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ విధంగా కూడా మార్చుకోవచ్చని చెప్పారు. మేయర్ మాట్లాడుతూ మొబైల్ వాహనాల కోసం ఎదురుచూసే పని లేకుండా కార్డుదారులే తమకు అనువైన సమయంలో సరుకులు తీసుకునేలా ప్రస్తుత విధానం ద్వారా వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చౌక దుకాణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

లబ్ధిదారులకు రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చౌక దుకాణాలలో రేషన్ సరుకులు తీసుకోని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని ఈపూరుపాలెంలో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దన్ ప్రారంభించారు. కాగా తహసీల్దార్ గోపి కృష్ణతో కలసి లబ్ధిదారులు జాబితా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ చౌక దుకాణముల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సరుకులు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం నుండి చౌక దుకాణములలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ షాపులలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరల సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు డీలర్లు విధిగా చౌక దుకాణాలలో ఉండి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గుద్దంటి చంద్రమౌళి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిరాదరణకు గురైన..

బాలల ఉజ్వల భవిష్యత్తుకు సహకరించాలి

టూటౌన్ సిఐ శ్రీనివాసరావు

మాట్లాడుతున్న టూటౌన్ సిఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిరాదరణకు గురైన, నా అనే వాళ్లను కోల్పోయి నిస్పృహ.. ఆవేదనలో ఉన్న బాలల పట్ల ప్రేమ, ఆప్యాయత చూపాలని, వారి ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరం తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఒంగోలు రెండో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం, అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు ఆశ్రమంలోనే బాలలతో గడిపారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు, అనారోగ్య కారణాల వల్ల, అనేకమంది బాలలు చిన్నతనంలోనే వారి తల్లిదండ్రులను కోల్పోయారని అది చాలా బాధాకరమైన విషయమని చెప్పారు. ఆ బాలలు నిత్యం తమకు తల్లిదండ్రులు లేరని ఆవేదనతో, ఎవరికీ చెప్పుకోలేని మనోవేదనతో ఉంటారని, అటువంటి వారికి తప్పకుండా మనం ఆశ్రమం కలిగించి.. వారికి తల్లిదండ్రులు లేరనే భావన వారిలో రాకుండా ఆప్యాయత చూపాలన్నారు. మనమే వాళ్లకి తల్లితండ్రులమని, తోబుట్టువులమని, వారు మన కుటుంబంలో ఒక సభ్యులేననే భావన వారిలో కలిగించి వారికి ఆత్మస్థైర్యం కలిగించాలన్నారు. వారి అభివద్ధికి మనందరం కృషి చేసినట్లయితే ఆ బాలలు రేపు ఉన్నత స్థాయికి వచ్చిన తర్వాత వారు తప్పకుండా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. వారు ఇంకొకరికి సహాయపడే దిశగా పయనిస్తారని అన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బివి.సాగర్ మాట్లాడుతూ బాలల హక్కులు పరిరక్షించినప్పుడే బాలలకు ఉజ్వల భవిష్యత్తు అందుతుందన్నారు. బాలల పట్ల వివక్షత విడనాడాలన్నారు. బాలలపై లైంగిక వేధింపులు నిరోధించాలన్నారు. గత దశాబ్దాకాలపైగా ఈ బొమ్మరిల్లులో చేర్పించిన బాలల నేడు న్యాయవాదులుగా, జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో క్రీడారంగంలో అనేక గుర్తింపులు, ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారని వారు ఈ స్థాయికి రావటానికి పూర్తిగా నిరంతరం కషి చేస్తున్న బొమ్మరిల్లు నిర్వాహకులు కాసిం రాజ్యలక్ష్మి సేవల వెలకట్టలేనివని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వన్‌టౌన్ సిఐ వై.నాగరాజు బాలలకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొమ్మరిల్లు నిర్వాహకులు ఎస్ఎండి.ఖాశిం, వన్‌టౌన్ ఏఎస్ఐ బాబూరావు, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి పాల్గొన్నారు.

ఏలూరి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

స్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయింపు

ప్రజాశక్తి - కారంచేడు

స్థానిక ముస్లిం స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చొరవతో ప్రభుత్వం నిధులు కేటాయించింది. స్మశాన వాటికకు సరైన ప్రహరీ నిర్మాణం లేక అనేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ప్రహరీ నిర్మాణం చేపడతామని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నిధులు మంజూరు చేయడంతో ముస్లిం మైనారిటీలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రహరీకి రూ.10 లక్షల నిధులు కేటాయించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు ముస్లిం మహిళలు పాలాభిషేకం చేశారు.

చేనేతను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - వేటపాలెం

బీరక సురేంద్ర

చేనేత సహకార సంఘాలను ప్రభుత్వం పట్టించు కోకపోవడంతో చేనేత వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి పాలక మండలి ఏర్పాటు చేయాలని కోరారు. జగన్ ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న చేనేత కార్మికునికి ఏడాదికి రూ.24వేలు ఇచ్చి ఆదుకున్నట్లు గుర్తు చేశారు. నేతన్న నేస్తం అమలు చేయాలని కోరారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్ జీఓకే పరిమితం చేయకుండా వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. అప్కో చైర్మన్‌ను నామినేట్ చేసి ఇప్పటివరకు జిఒ ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. చేనేత వర్గం మద్దతుతో గెలిచిన లోకేష్ దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. ఎన్నికల్లో జిఎస్టిపై లోకేష్ ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. చేనేత అభివృద్ధి తోపాటు ఆకలి చావులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు.

అక్కాయపాలెం హెచ్ఎంగా జెల్లి శేఖర్‌బాబు

బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు కొత్తగా బదిలీలపై వచ్చి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు దొనకొండ మండలం కొచ్చర్లకోట నుండి దేవరకొండ సరోజిని, పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాలకు త్రిపురాంతకం మండలం గొల్లపల్లి నుండి తలమల దీప్తి, అక్కయ్యపాలెం ఉన్నత పాఠశాలకు కారంచేడు మండలం యర్రంవారిపాలెం నుండి జెల్లి శేఖర్ బాబు, కటారివారిపాలెం ఉన్నత పాఠశాలకు కారంచేడు మండలం కుంకలమర్రు నుండి కొత్త పద్మావతి బదిలీలపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేలతో ఆహ్వానం పలికారు.

తీరంలో కలవరపెడుతున్న డ్రెయిన్లు

- గుర్రపు డెక్క తొలగించాలంటూ రైతుల ఆవేదన
- ప్రశ్నార్థకంగా మురుగు కాలువల మరమ్మత్తుల
- రేపల్లె సబ్ డివిజన్‌లో రూ.1.42కోట్లు మంజూరు

ప్రజాశక్తి - రేపల్లె

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు వ్యవసాయానికి సమాయత్తం అవుతున్నారు. ఈ తరుణంలో వ్యవసాయ మురుగు నీటి కాలువల మరమ్మత్తులు తీర ప్రాంతంలో ప్రశ్నార్ధకంగా మారింది. కూటమి ప్రభుత్వం మురుగు కాలువల అభివృద్ధికి నిధులు మంజూరు చేశమని చెబుతున్నప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మే నెలలో ప్రారంభించాల్సిన పనులు ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్న సమయంలో తీర ప్రాంతంలో ఎక్కడా పూడికలు తీయలేదు. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంగా పెరిగిన గుర్రపుడెక్క తొలగించలేదు. ఏటా అధిక వర్షాలతో పంట పొలాల్లో తిష్టవేసే నీరు బయటకు పోవాలంటే డ్రెయిన్లలో నీరు పోయేలా ఉండాలి. గుర్రపుడెక్క, తూటికాడతో కాలువలు పూడుకుపోయి ఉంటే పంట పొలాల్లో నిలిచిన నీరు ఏ విధంగా పోతుందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా పంట చేతికి వచ్చే సమయంలో నీట మునిగి పంటలు పాడవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధిక వర్షాలకు మురుగు కాలువలు పారుదల లేక రైతుల పంటలు నీటమునిగి తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు సాగు చేపట్టే వరకు పనులు చేపట్టకుండా వర్షాలు పడినప్పుడు హడావుడి చేసి రైతులకు నష్టం చేసే విధంగా

గుర్రపుడెక్కతో మూసుకపోయిన మురుగు కాల్వలు

అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో 1.20లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది వేల ఎకరాల్లో వరి నీట మునిగి లక్షల్లో నష్టం వాటిల్లుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రతి సంవత్సరం అధిక వర్షాలు నమోదు అయినప్పుడు మురుగు కాలువల ద్వారా నీరు పారుదల కాకపోవడమే ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు. వర్షాలు పడినప్పుడు హడావుడి చేస్తూ రూ.లక్షల బిల్లులు గుట్ట చప్పుడు కాకుండా చేసుకుంటున్నారే తప్ప రైతులకు మాత్రం ఉపయోగం ఉండటం లేదు. మండలంలోని అరవపల్లి, జగర్దేరు, ఉప్పూడి, సింగుపాలెం సమీపంలోని బడే కాలువ, నగరం మండలంలోని మంగళగుంట డ్రైయిన్, గంగోలు డ్రెయిన్, అద్దంకివారిపాలెం డ్రెయిన్, చెరుకుపల్లి మండలంలో ఉచావారిపాలెం ఓల్డ్ కోర్స్ డ్రైయిన్, రాజోలు నుంచి గూడపల్లి, పొన్నపల్లి, ఆరేపల్లి, బలు సులపాలెం, తుమ్మలపాలెం మీదుగా నిజాంపట్నం మండలం చింతరేవు మెయిన్ డ్రైయిన్లో ఎక్కడా పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దృష్టి సారించి రైతులకు మేలు చేసే విధంగా మురుగు కాలువల మరమ్మత్తులు చేపట్టి అన్నదాతకు నష్టం లేకుండా చూడాలని రైతుల కోరుతున్నారు.

ముందస్తు చర్యలేవీ

వేసవి కాలంలో డ్రైన్‌ల మరమ్మతులు చేయాల్సిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవటంతో తూటుకాడ, గుర్రపు డెక్క కలుపుజాతి మొక్కలతో కాలువలు నిండిపోయాయి. వేసవిలో ఉపాధి పనులతో గానీ, స్ప్రేయింగ్ పద్దతుల్లో గానీ డ్రైన్‌లో చెత్తా చెదారాలు తొలగించే చర్యలు చేయక అధికారులు మిన్నకుండిపోయారు. దీంతో డ్రైన్‌లు పూడిపోయే దుస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైన్లు ఆధునీకరిస్తాం : డ్రైనేజీ డిఇఇ పి వీరయ్య వివరణ

సబ్ డివిజన్ పరిధిలో ఓ అండ్ ఎం పనులకు సంబంధించి రూ.1.42 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈపాటికే ప్రధాన డ్రెయిన్ల పనులు చేపట్టామని అన్నారు. అకాల వర్షాల వల్ల కొంత ఆటంకం ఉన్నప్పటికీ వారంలోపు మరమ్మత్తు పనులు ప్రారంభిస్తామన్నారు. రైతులు అధైర్య పడొద్దని, సకాలంలో డ్రెయిన్ల పనులు పూర్తి చేసి రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేస్తామని తెలిపారు.

గిట్టుబాటు ధర లేక బొప్పాయి రైతు దిగాలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

పండిన బొప్పాయితోట

మండలంలోని కొమ్మాలపాడు, మామిళ్ళపల్లి గ్రామాల రైతులు ఈ ఏడాది హెచ్ఎడి 786 రకం బొప్పాయి పంట 400 ఎకరాలకు పైగా సాగు చేశారు. ఎకరాకు వెయ్యి మొక్కలు నాటారు. రూ.1.50లక్షలపైగా ఎకరాకు పెట్టుబడి ఖర్చు చేశారు. ఆ రకం బొప్పాయి ఎకరానికి 20 నుండి 25 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. కానీ మొదట టన్నుకి రూ.23వేల ధర పలికి, నేడు రూ.4వేలకు పడిపోవడంతో రైతులు దిగాలు పడ్డారు. రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయానికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

రైతులు పంటలు సాగు చేసే ముందుగా భూసార పరీక్షలు చేయించుకొని వాటికి అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించుకోవాలని, తేలికపాటి దుక్కులు దున్నటం వలన భూమి నుండి ఆశించే వేరు కుళ్ళు తెగుళ్ల నుండి పంటలు రక్షించుకోవచ్చని కెవికె ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీ ప్రయాగ రైతులకు సూచించారు. మండలంలోని పెద్ద ఉల్లగల్లు, పులిపాడులో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని కెవికె మోడల్ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎఒ ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఈ పంట నమోదు, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే వివిధ రకాల పథకాలను తెలిపారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై వచ్చే పచ్చిరొట్టె ఎరువుల విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు ముక్కుమళ్ళ శ్రీనివాసరెడ్డి, జన మాల నాగేంద్రం, పిచ్చయ్య, కార్యదర్శులు జె రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

ఉచిత సేవలకు వైద్య కిట్ బహూకరణ

ప్రజాశక్తి - వేటపాలెం

వృత్తిరీత్యా చిన్నగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ ప్రవృత్తిగా పందిళ్లపల్లిలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్న పమిడాల సుబ్బారావు అలియాస్ షారుక్ అభినందనీయులని హారిజోన్ స్కూల్ కమిటీ కార్యదర్శి డాక్టర్ పొగడ దండ రవికుమార్ అన్నారు. సుబ్బారావు తాను పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడంతోపాటు తన ఉద్యోగ విధుల అనంతరం తాను నివాసం ఉంటున్న పందిళ్లపల్లి గ్రామంలో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని అన్నారు. సుబ్బారావు చేస్తున్న ఉచిత వైద్య సేవలకు అవసరమైన బ్యాండేజ్ రూల్స్, ఆయింట్మెంట్లు, కాటన్ రోల్స్, యాంటీ సెప్టిక్ రోషన్ డ్రెస్సింగ్ మెటీరియల్‌ను అందజేశారు.

వైద్య కిట్ అందజేస్తున్న డాక్టర్ రవికుమార్

గ్రామంలో మరింత వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. తన సేవలకు అవసరమైన కట్టు గుడ్డలు, మందులు అందించడం వల్ల పేదలకు చేరువగా వైద్య సేవలు అందించేందుకు దోహద పడతాయని సుబ్బారావు అన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున

బూటకపు హామీలతోనే చంద్రబాబుకు అధికారం

ప్రజాశక్తి - ఇంకొల్లు

బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి మేరుగ నాగార్జన ఆరోపించారు. చంద్రబాబు హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. హామీలు అమలు చేయాలని ఈనెల 4న వెన్నుపోటు దినోత్సవం వైసిపి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పావులూరులో వైసిపి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైసిపి పర్చూరు ఇన్చార్జి గాదె మధుసూదన్ రెడ్డి జరిగిన సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ ఏడాది పాలనలో ఓటు వేసిన ప్రజలకు ముఖ్యమంత్రిచంద్రబాబు వెన్నుపోటు పొడిచారని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుల్లపల్లి జెడ్‌పి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలం గుల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల 97-98లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నాటి విద్యార్థుల బృందం తరలివచ్చి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. తాము ఏ ఏ రంగాల్లో స్థిరపడ్డామో వివరిస్తూ తమను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ అలపర్తి ఆంజనేయులు, సత్యనారాయణ, బేబీ సురేఖ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన భూమిని భావితరాలకు అందిద్దాం

ప్రజాశక్తి - రేపల్లె

స్వచ్ఛమైన భూమిని భావితరాలకు అందించే బాధ్యత మనపై ఉందని శ్రీ బయో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ మైక్రోబయాలజీ శాస్త్రవేత్త డాక్టర్ కెఆర్‌కె రెడ్డి అన్నారు. మండలంలోని నల్లూరుపాలెంలో 'మట్టే ప్రధానం' అనే కార్యక్రమంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో ఉపయోగించడం వలన భూసార సామర్థ్యం తగ్గుతుందని అన్నారు. రసాయనిక వ్యర్థాల నుంచి భూమిని రక్షించి భూసారాన్ని పెంచేందుకు రైతులు ప్రోబయోటిక్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మనిషి మనుగడకు, రసాయనిక ఉత్పత్తుల నుండి భూమిని రక్షించేందుకు, పంటల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సూక్ష్మజీవులు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. సూక్ష్మజీవుల వలన మనుషులు, పంటలకు కలిగే నష్టం కంటే లాభం ఎక్కువగా ఉంటుందని వివరించారు. భూమి మన స్వంతం కాదని, మన సంతతికి అప్పగించాల్సిన విలువైన కానుకని అన్నారు. భూసారాన్ని పెంచేందుకు రసాయనికాలను తగ్గించి, సహజ పదార్థాలతో భూమికి తిరిగి జీవం నింపాలని తెలిపారు. మట్టిని కాపాడేందుకు

మాట్లాడుతున్న శ్రీ బయో అధినేత డాక్టర్ కెఆర్‌కె రెడ్డి

రైతులు మట్టి పరీక్షలు చేయించడంతో పాటు సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని అన్నారు. సూక్ష్మజీవుల సమ్మేళనమైన బయోఫెర్టిలైజర్ల వాడకాన్ని పెంచడం ద్వారా భూమి స్వచ్ఛత కాపాడవచ్చన్నారు. మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపర్చటం ద్వారా లాభాదాయకమైన పంటల ఉత్పత్తులను సేకరించవచ్చని తెలిపారు. మట్టిలో జీవాన్ని నింపడం వలన నేలల్లో పోషకాల లభ్యత పెరిగి పంటలు తెగుళ్లను, పురుగులను, తట్టుకునే శక్తి గ్రహిస్తాయని అన్నారు. సూక్ష్మజీవుల ఉత్పాదనల వలన మొక్కల్లో హార్మోనులు, జీవ ఉత్ప్రేరకాలుగా పెరిగి మంచి పెరుగుదల, పూత, కాపుతో దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విస్తరణ విభాగాధిపతి డాక్టర్ ఎం సురేష్ కుమార్ మాట్లాడుతూ అవసరానికి మించి రసాయన ఎరువులు పురుగు మందులు వాడటం వల్ల భూమి గట్టిగా మారి విలువైన సూక్ష్మజీవాలు, వానపాములు నశించి మట్టి జీవ రహితంగా మారుతుందన్నారు. మట్టిలో జీవం పెంచకపోతే కొన్ని సంవత్సరాల్లోనే పంటల దిగుబడుల శక్తి నేలలో తగ్గిపోతుందని అన్నారు. భూమి మన సొంతం కాదని, భావితరాలకు బహుమతి అనే విషయాన్ని ప్రతి రైతు గుర్తుంచుకోవాలని అన్నారు. మట్టిని సారవంతం చేసి జీవ ఉత్పాదనాలైనా శ్రీ బయో వారి ఇండిరూట్స్ ఉపయోగించాలని అన్నారు. ఇండి రూట్స్‌తో పోషకాల లభ్యత పెరుగుతుందని అన్నారు. హెల్‌చెక్ ఉపయోగించటం వలన చౌడు నుండి భూమిని కాపాడుతుందని అన్నారు. మైకో సిగ్నల్ క్రియ, శీధరలతో పోషకాల లభ్యత, తెగుళ్లను తట్టుకునే శక్తి పెరిగి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. ప్రతి రైతు సూక్ష్మ క్రిముల సేద్యంపై అవగాహన పెంచుకొని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ బయో వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున, జోనల్ మేనేజర్ రామారావు, భూమిత్ర డీలర్, తేజస్విని ఫర్టిలైజర్స్ ప్రొప్రైటర్ సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - నగరం

నేడు అనగా 02న సోమవారం నగరం సబ్ స్టేషన్‌కు 11 కెవి ఫీడర్ మరమ్మత్తు నిమిత్తం నగరం పంచాయతీ, పరిసర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎఇ కరిముల్లా తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పంగులూరు : మండలంలోని రామకూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రామకూరు ఫీడర్‌లో సోమవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎఈ గోరంట్ల అనిల్ కుమార్ ఆదివారం తెలిపారు. ఫీడర్ మరమ్మత్తుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

చెరుకుపల్లి : కావూరు 33/11 సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిఈఈ ఎస్ సురేష్ బాబు తెలిపారు. చెరుకుపల్లి 33కెవి ఫీడర్ మరమ్మతుల కారణంగా చెరుకుపల్లి, కావూరు, ఆరుంబాక, ఏమినేనివారిపాలెం పంచాయతీల పరిధిలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

భట్టిప్రోలు : మండలంలోని పెద్దపులివరు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని పెదపులివర్రు, గుతవారిపాలెం, పెదపాలెం, కొల్లపాలెం, ఓలేరు, తూర్పుపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ మరమతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ శాంత కుమారి తెలిపారు.

కారంచేడు : ఈ నెల 2న సోమవారం రోజు కుంకలమర్రు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏఈ రాంబాబు తెలిపారు. సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. 11 కెవి ఫీడర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

కాలి వంతెన ఛిద్రమై ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని గంగడిపాలెం వద్ద బ్యాంక్ కెనాల్ మీద ఉన్న కాలి వంతెన మధ్యలో చిద్రమై కొంత భాగం కూలి పోవడంతో స్థానిక ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు, మత్స్యకారులకు పెద్ద సమస్యగా మారింది.

పగిలిన కాలి వంతెన

వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు, రైతు కూలీలు నిత్యం వంతెనపై రాకపోకలు నిర్వహిస్తుంటారు. కృష్ణా నదిలో చేపల వేటకువెళ్లే మత్స్యకారులకు ఇదే ఆధారం. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

గురువులకు పూర్వ విద్యార్థుల సన్మానం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరులోని జెడ్‌పి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (1994- 95) సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆత్మీయ పలకరింపులు, గురువులకు ఘన సత్కారాలతో సందడి చేశారు. తాము చదివే రోజుల్లో పాఠశాలలో చేసిన అల్లరి, ఆట పాటలు, గురువులు చెప్పిన పాఠాలు గుర్తు చేసుకున్నారు. ఉత్తమ విద్యా బోధనతో తమ జీవితాలను తీర్చిదిద్దిన గురువులను స్మరించుకొని ఘనంగా సత్కరించారు. తమకు విద్య అందించి, ఉన్నతంగా తీర్చిదిద్దిన పాఠశాల అవసరాలకు గివింగ్ బ్యాంక్ నిధిగా రూ.1.50లక్షలు అందజేశారు. హెచ్ఎం చందలూరు గిరిజ, విశ్రాంత హెచ్ఎం నార్ని తాతయ్య, రామిశెట్టి శ్రీనివాసరావును అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్

రిటైర్డ్ హెచ్ఎంను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ, పాఠశాల వ్యవస్థాపక ప్రతినిధులు అడ్డగడ సుబ్బయ్య, బసవేశ్వరరావును సత్కరించారు. దివంగతులైన ఉపాధ్యాయుల సేవలను స్మరించుకొని శ్రద్ధాంజలి ఘటించారు. స్టాఫ్ సెక్రటరీ రావి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనవిజ్ఞానవేదిక సభ్యునిగా చేరండి

ప్రజాశక్తి - బాపట్ల

ఉత్తమ పౌర సమాజ నిర్మాణం కోసం శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకునేందుకు జన విజ్ఞాన వేదిక లో సభ్యులుగా చేరాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు వై భాస్కరరావు కోరారు. బాపట్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 15 వరకు రాష్ట్ర స్థాయిలో జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు జరుగుతుందని అన్నారు. 1988లో ఫిబ్రవరి 28న ప్రారంభమైన జెవివి గడచిన 38ఏళ్ళుగా శాస్త్ర విజ్ఞాన ప్రచార కృషిలో ఎన్నో మైలు రాళ్లు దాటిందన్నారు. ఈ

గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సందర్భంగా జెవివి గోడ ప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు కోట వెంకటేశ్వర్లరెడ్డి, చైతన్య కుమార్ పాల్గొన్నారు.

పంటకాలువ పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం చిన్న కాలువ పూడికతీత పనులు ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు టిడిపి గ్రామ అధ్యక్షులు దీపాల ప్రసాదు జెసిబితో పనులు ప్రారంభించారు. కాలువలో గుర్రపుడెక్క, తూటి కాడ పేరుకుపోయి నీరు దిగువకు పారే పరిస్థితి లేకపోవడంతో పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందటం లేదని, దీనిని దృష్టిలో ఉంచుకొని పూడికతీత పనులు చేపట్టినట్లు కనగాల నీటి సంఘం అధ్యక్షులు ఉప్పాల నాగేశ్వరరావు తెలిపారు. దీనితోపాటు మరికొన్ని కాలువలు కూడా పూడిక తీత పనులు చేపట్టి రైతులకు ఇబ్బంది లేని విధంగా చూస్తామన్నారు. కాలువల పూడిక తీత పనులు ప్రారంభించడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షులు అవ్వారు సత్యనారాయణ,

జెసిబితో పనులు ప్రారంభిస్తున్న నాయకులు ప్రసాద్

డైరెక్టర్ మల్లారపు నాగేశ్వరరావు, పంచాయతీ సభ్యులు గాత్రం బాలకృష్ణ, రైతులు మాచర్ల రంగయ్య, తిరుమలరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ కమిటీ సభ్యులు ఎన్నిక

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పంగులూరు

విశ్వబ్రాహ్మణ సంఘం మండల నూతన అధ్యక్షులుగా మచ్చా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని రేణంగివరం వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో సంఘ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళ పాటి నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా రావినూతల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షులు కడలి జగదీష్ మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులు విశ్వ బ్రాహ్మణ సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. జిల్లా సంఘం నుండి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మునగంటి నరసింహ చారి, కోశాధికారి మచ్చా సుధాకర్, ఉపాధ్యక్షులు మణికేశ్వరం మధు, గుంటుపల్లి బ్రహ్మం, కొండముది బాపూజీ, అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ పామర్తి శ్రీనివాసరావు, మచ్చా శేషాచారి, కాజన అప్పయ్య, తక్కెళ్ళపాటి రామకృష్ణ, ఉండవల్లి బ్రహ్మయ్య, కొండముది ఆంజనేయులు, మురికిపూడి ఓంకార శర్మ పాల్గొన్నారు.

కథా సంపుటి ఆవిష్కరిస్తున్న కవులు

'వడలి' కథా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని కమఠేశ్వరస్వామివారి ఆలయంలో సృజన, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వడలి రాధాకృష్ణ (వీరాల) కథాసంపుటి గ్రీన్ లైట్ ఏరియా ఆవిష్కరణ సభ ఘనంగా ఆదివారం నిర్వహించారు. సభకు చప్పిడి వీరయ్య అధ్యక్షత వహించారు. కథా సంపుటిని శతావధాని శ్రీమాన్ నారాయణం బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. తొలిప్రతిని సాహిత్యవేత్త చెన్నుపాటి రామాంజనేయులు స్వీకరించారు. వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) జ్యోతిప్రజ్వలన చేశారు. కథా రచయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి కథాసంపుటిని సమీక్షించారు. మన్నం త్రిమూర్తులు, చుండూరి మురళీ సుధాకరరావు, కె అనిలకుమారసూరి, షేక్ మహమ్మద్ రఫీ, లక్ష్మరాజు శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, రోటరీ అధ్యక్షులు అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్, కోట అంజమ్మ, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, డాక్టర్ బీరం సుందరరావు, మంత్రి కృష్ణమోహన్, సంఠా సుబ్రహ్మణ్యం (బాబు), పుట్టంరాజు శ్రీరామ చంద్ర మూర్తి పాల్గొన్నారు.

వెల్లలచెరువు-అడవిపాలెం మధ్య దారిదోపిడీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువు నుండి అడవిపాలెం వెళ్లే రహదారిలో రాత్రి వేళల్లో సంతమాగులూరు మేజర్ కాలువ సమీపంలో దొంగలు మాటు వేసి అటుగా బైకులపై వచ్చే వారిని టార్గెట్ చేసి వెంటాడి పట్టుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారని ప్రజలు చెబుతున్నారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు నమోదు కానప్పటికీ గత నెలరోజుల్లో ఐదుపైగా దారి దోపిడీ సంఘటనలు జరిగినట్లు సమాచారం. దీంతో రాత్రులందు బైకులపై వెళ్లాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెన్నుపోటు పొడిచింది జగనే..

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

మంత్రి స్వామి

గత ఐదేళ్ల ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన జగన్ 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసనలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం నాడు ప్రకాశం జిల్లా, తూర్పు నాయుడుపాలెంలో మీడియాతో మాట్లాడారు. వైసిపి అరాచక పాలనను ప్రజలు కూకటివేళ్లతో పెకలించిన రోజు జూన్ 4 అని తెలిపారు. ప్రజల తీర్పును వెన్నుపోటు అనడం సిగ్గుచేటన్నారు. గత ఐదేళ్ల ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగనేనన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కానీ వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మిగిలారని చెప్పుకునేందుకే నిరసనలు చేస్తున్నారని అన్నారు. జగన్ తన తీరు మార్చుకోకపోతే ఆ 11 మంది కూడా మిగలరని స్వామి హెచ్చరించారు.

అంబేద్కర్ ఊరేగింపును అడ్డుకున్న

దోషులను అరెస్టు చేయాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

అంబేద్కర్ చిత్రపటం ఊరేగింపు అడ్డుకున్న కే.బిట్రగుంట దోషులను వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలియజేశారు. ఆదివారం కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ జిల్లా ఉపాధ్యక్షులు వి. మోజేష్ కే బిట్రగుంట దళిత కాలనీకి చేరుకొని అంబేద్కర్ చిత్రపటం ఊరేగింపు కేసు బాధితులైన దళిత యువకులతో, స్థానికులతో చర్చించారు.. అనంతరం మాల్యాద్రి మాట్లాడుతూ అంబేద్కర్ చిత్రపటం ఊరేగింపు విషయంపై ఈపాటికే కేసు నమోదు అయినప్పటికీ దోషులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఈ పాటికి కలెక్టర్ ఈ కేసులో జాప్యం చేసిన ఎస్ఐను సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. స్వయానా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నియోజక వర్గంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, అరెస్టుల విషయంలో ఈ విధమైన పక్షపాత ధోరణి ఉంటే మరి ఇతర నియోజకవర్గాల్లో దళితుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. బాధితులకు అండగా ప్రభుత్వం నిలవాలని కోరారు. దళిత ఓట్లు పొందిన ప్రతిపక్ష నాయకులు మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగంపై ప్రేమ ఉంటే దాన్ని నిలువునా పాతర వేసి అవమానపరచిన పెత్తందార్లను శిక్షించేందుకు తమ రాజకీయ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు.

మంత్రుల హామీలు అమలుచేయని కంపెనీలు

5న గుంటూరు జిపిఐ కంపెనీ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-ఇంకొల్లు

మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

గత నెలలో మార్టూరులో పొగాకు కంపెనీలు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యే జరిపిన సమావేశంలో పొగాకు కొనుగోలు విషయంలో ఇచ్చిన హామీలను కంపెనీలు అమలు చేయడం లేదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కష్ణయ్య అన్నారు. ఆదివారం ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలో మంచాల వెంకటరామయ్య, వెంకటరంగమ్మ విద్య, వైద్య, విజ్ఞాన వేదిక కళ్యాణ మండపంలో పొగాకు రైతుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైతుసంఘం రాష్ట్ర నాయకులు వలేటి కృష్ణయ్య మాట్లాడారు. మంత్రుల సమావేశంలో పొగాకు కంపెనీలు హైయర్ గ్రేడ్ పొగాకు క్వింటాలు 12 వేల రూపాయలకు, లోయర్ గ్రేడ్ పొగాకు క్వింటాల్ రూ.6 వేలకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అయితే అది అమలు జరపటంలో కంపెనీలు విముఖత చూపుతున్నాయన్నారు. చెప్పిన ప్రకారం సరి అయిన ధర ఇవ్వక సమయానికి పొగాకు కొనుగోలు సంబంధించిన గేట్ పాసులు ఇవ్వకుండా రైతులను నానారకాలుగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఇప్పటికే పర్చూరు మండలం పంగులూరు మండలంలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఇంకొల్లు మండలం, దుద్దుకూరులో మరో రైతు ఆత్మహత్యా యత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి టి.రామారావు మాట్లాడుతూ రైతులతో పొగాకు వేయించి ప్రస్తుతం కొనుగోలు చేయకుండా మోసం చేస్తున్న కంపెనీల చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 5న గుంటూరు విద్యానగర్‌లో ఉన్న జిపిఐ కంపెనీ ఆఫీసు ముందు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు అందరూ జయప్రదం చేయాలని కృష్ణయ్య, రామారావుతో పాటు పలువురు రైతు నాయకులు కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు వణుకురి శ్రీనివాస్‌రెడ్డి, రామకోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పని ఒత్తిడిలోనూ సమర్థవంతంగా విధులు

- ఎస్పీ తుషార్ డూడి
- అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ దంపతులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆత్మీయ వీడ్కోలు సభలో సత్కరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టిపి.విఠలేశ్వర్ ఉద్యోగవిరమణ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎస్పీ తుషార్‌డూడి అడిషనల్ ఎస్పీ దంపతులను, ఆయనతో పాటు పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ బి.ప్రభాకర్ రావు దంపతులను వారి బంధువులు, కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులు సిబ్బంది సమక్షంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ అంటే జిల్లా ఎస్పీకి కుడి భుజం లాంటి వాడని తెలిపారు. ఎంతో అనుభవం ఉన్న ఒక అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి ఉద్యోగ విరమణ పొంది వెళ్లడం అనేది తీరని లోటని అన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే వారికి పని ఒత్తిడి అధికంగా ఉంటుందన్నారు. దాని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అయితే వాటన్నింటినీ సమర్ధవంతంగా అధిగమించి 40 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు విశేష సేవలు అందించడం అనేది సామాన్యమైన విషయం కాదని తెలిపారు. అడిషనల్ ఎస్పీకి ఒక పనిని అప్పగిస్తే దానిని సమర్ధవంతంగా నిర్వహించగల సామర్థ్యం అతనికి ఉందని తెలిపారు. ఇటీవల కష్ణానది పరివాహక ప్రాంతంలో వరద నీటి ముంపునకు లంక గ్రామాలు గురవుతున్న సందర్భంలో ఆ గ్రామంలోని ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు తరలిస్తూ వస్తున్న క్రమంలో ఒక్కసారిగా వరద నీరు అడిషనల్ ఎస్పీ ఉన్న చిలుమూరి లంక గ్రామాన్ని చుట్టుముట్టేయడంతో ఆయన ఆ గ్రామంలోనే ఉండవలసి వచ్చిందన్నారు. ఆయనతో పాటు పదిమంది పోలీస్ సిబ్బంది కూడా ఉన్నారని తెలిపారు. ఆయన వయసును దష్టిలో ఉంచుకొని అవసరమైతే ఏరియల్ సేవలను వినియోగించుకుని అడిషనల్ ఎస్పీని బయటకు తీసుకుని వద్దామని భావించి ఆయనకు ఫోన్ చేసి అడగడం జరిగిందన్నారు. తాను క్షేమంగానే ఉన్నానని, ఏం పర్వాలేదని, ప్రజలకు అండగా ఇక్కడే ఉండి సేవలు అందిస్తానని తెలిపాడన్నారు. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా తన గురించి ఆలోచించకుండా ప్రజల యొక్క శ్రేయస్సును గురించి ఆలోచించి అధికారి దొరకటం ఎంతో సంతోషం కలిగించే విషయం అన్నారు. ఎంతటి కఠినమైన పరిస్థితుల్లోనైనా సమర్ధవంతంగా విధులు నిర్వహించే సత్తా అడిషనల్ ఎస్పీకి ఉందని తెలిపారు. వందకు వంద శాతం పోలీస్ శాఖకు తన విలువైన సేవలను అందించారని కొనియాడారు. నేటితరం పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనను ఆదర్శంగా తీసుకుని అంకితభావంతో విధులు నిర్వహించాలని తెలిపారు. అడిషనల్ ఎస్పీ వారి శేష జీవితం ఆరోగ్యవంతంగా ఆహ్లాదకరంగా గడపాలని ఆకాంక్షించారు.

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అనే సామెత పోలీస్ శాఖలో చాలా బాగా ఉపయోగపడుతుందన్నారు. పోలీసు ఉద్యోగం ప్రతినిత్యం సవాళ్లతో కూడుకుని ఉంటుందన్నారు. ప్రతిరోజు ఉదయం లేచినప్పడి నుంచి రాత్రి పడుకునే వరకు ఏదో ఒక సమస్య ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఉన్నప్పుడే మన విధులను సమర్ధవంతంగా నిర్వహించగలుగు తామన్నారు. కుటుంబ సభ్యుల పూర్తి సహకారం వల్లే 40 సంవత్సరాలా 3 నెలల సర్వీస్ సమర్ధవంతంగా నిర్వహించగలిగినట్లు తెలిపారు. ఉద్యోగం మాత్రమే జీవితం కాదని, జీవితంలో ఉద్యోగం కూడా ఒక భాగమని, కుటుంబానికి కూడా సమ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల, రేపల్లె, సిసిఎస్ డిఎస్పీలు, ట్రైనీ డిఎస్పి, ఏఆర్ డిఎస్‌పి, జిల్లాలోని సిఐలు, ఆర్‌ఐలు, అడిషనల్ ఎస్పీ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

ఫారం పాండ్స్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

- 1.11 కోట్ల పని దినాలు కల్పించేందుకు కృషి
- త్వరితగతిన పశువుల నీటి తొట్ల నిర్మాణం
- ఇంకుడు గుంతల నిర్మాణంపై శ్రద్ధ
- డిఆర్‌డిఎ పీడీ జోసఫ్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముఖాముఖి

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో ఫారం పాండ్స్ నిర్మాణంపై ప్రత్యేక దష్టి సారించినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.జోసెఫ్ కుమార్ తెలియజేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో అర్హులైన వారందరికీ పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు జిల్లాలో పశువుల నీటితోట్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు కషి చేస్తున్నామన్నారు. నిర్దేశించిన ఇంకుడు గుంతలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే..

కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారియా ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో జిల్లాలో ఇప్పటివరకు 4 లక్షలా 46 వేల కుటుంబాలకు జాబ్‌కార్డులు మంజూరు చేశాం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1.11 కోట్ల పనిదినాలు కల్పించటం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 20.60 లక్షల పనిదినాలు కల్పించాం. వేతనాల రూపంలో రూ.19.38 కోట్లు ఖర్చు చేశాం. సుమారు 1.54 లక్షల కుటుంబాలలోని 2.52 లక్షల మంది వేతనదారులకు పనులు కల్పించాం. గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు రూ.16.26 కోట్లు మెటిరియల్ చెల్లింపులలో ఖర్చు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.65.04 కోట్లు ఖర్చు చేశాం.

ఫారం పాండ్ నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా రైతుల పొలాలలో 9200 ఫారం పాండ్స్ నిర్మించడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 5967 పనులకు పరిపాలనా ఆమోదం పొందాం. 1,656 పనులు పురోగతిలో ఉండగా, 589 పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో నిర్మాణం పూర్తి చేశాం.

గోకులాల నిర్మాణానికి రూ.12.20 కోట్ల ఖర్చు

ఉపాధి హామీలో భాగంగా 1075 గోకులాలు నిర్మించడం లక్ష్యం నిర్దేశించాం. ఇప్పటివరకు 1216 గోకులాల నిర్మాణ పనులకు సంబందించి పరిపాలన ఆమోదం తీసుకున్నాం. ఇందులో భాగంగా 196 పనులు పురోగతిలో ఉండగా, 896 పనులకు సంబంధించి, జిల్లాలోని వివిధ గ్రామాలలో గోకులాలు నిర్మించాం. 124 పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.12.20 కోట్ల రూపాయలు ఖర్చు చేశాం.

త్వరితగతిన పశువుల నీటి తొట్ల నిర్మాణం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా 1450 పశువుల నీటి తొట్లు నిర్మించటం లక్ష్యంగా నిర్దేశించాం. ఇప్పటివరకు 1376 పశువుల నీటి తొట్ల పనులకు సంబందించి పరిపాలన ఆమోదం తీసుకున్నాం. అందులో భాగంగా 233 పనులు పురోగతిలో ఉండగా, 1079 పనులకు సంబందించి, వివిధ గ్రామములలో పూర్తి స్థాయిలో పశువుల నీటి తొట్లు నిర్మించాం. 64 పనులకు సంబంధించి పనులు ప్రారంభించవలసి ఉంది. ఇప్పటివరకు రూ.3.16 కోట్ల రూపాయలు ఖర్చు చేశాం.

ఇంకుడు గుంటల నిర్మాణం

ఉపాధి హామీలో భాగంగా 17700 ఇంకుడు గుంటలు నిర్మించుటకు పరిపాలన ఆమోదం తీసుకున్నాం.. అందులో భాగంగా 8054 పనులు పురోగతిలో ఉండగా, 3424 పనులకు సంబంధించి, వివిధ గ్రామాలలో పూర్తిస్థాయిలో పశువుల నీటి తొట్లు నిర్మించాం.

మౌలిక సదుపాయాల కల్పన

గ్రామీణ ఉపాధి హామీలో గ్రామీణ మౌలిక సదుపాయాల పనులలో, రూ.180.70 కోట్ల అంచనా వ్యయంతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు మరియు బిటి రోడ్లు, పర్యాటక రోడ్లు నిర్మిస్తున్నాం.అలాగే జిల్లాలోని ఎస్సీ ఎస్టీ కాలనీలను అనుసందనం చేయటానికి అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి 1362 పనులకు పరిపాలనా అనుమతులు తీసుకున్నాం. యిప్పటి వరకు 131 పనులు పురోగతి ఉండగా, 1172 పనులు సంబందించి క్షేత్ర స్థాయిలో నిర్మాణం పూర్తి చేసాం.. 59 పనులు ప్రారంభించవలసి ఉంది. ఇందుకు గాను రూ.133.28 కోట్లు ఖర్చు చేశాం. రానున్న కాలంలో అందరి సహకారంతో జిల్లా నీటి యాజమాన్య సంస్థను అభివద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటాం.